ప్రజాశక్తి

గురువారం 17 ఏప్రిల్ 2025 5

శ్రీ సత్యసాయి

జాతీయస్థాయి హాకీ అకాడమీకి సోమందేపల్లి విద్యార్థిని

ప్రజాశక్తి-సోమందేపల్లి.

మండల కేంద్రంలోని వినాయక్ నగర్ నివాసి అయిన రవి నాయక్, రేణుక భాయి రెండవ కుమార్తె మధురిమబాయి అనే విద్యార్థి జాతీయస్థాయి హాకీ అకాడమీకి ఎంపికైనట్లు సోమందేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పిడిలు వన్నూరప్ప, రామారావు, రమేష్ తెలిపారు. జిల్లా పరిషత్ పాఠశాలలో ఏడవ తరగతి వరకు చదివి అనంతరం ఆర్డీటీ పాఠశాలకు ఎంపికై అక్కడి నుంచి బెంగళూరులోని మడికేర స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా హాకీ అకాడమీలో స్థానం సంపాదించుకొని అక్కడ ప్రతిభ కనబరచడంతో ముంబైలోని జాతీయ అకాడమీకి ఎంపిక చేశారని వారు చెప్పారు. ఈమె త్వరలోనే భారత జూనియర్ హాకీ టీం లో పాల్గొంటుందని చెప్పారు.

జగన్ పర్యటన సందర్భంగా హెలీక్యాప్టర్ వద్ద గుమికూడిన వైసిపి శ్రేణులు

చెన్నేకొత్తపల్లి పోలీసు స్టేషన్‌లో విచారణకు హాజరైన కో పైలెట్

'హెలికాప్టర్' విచారణ..!

- పైలెట్ గైర్హాజరు
- న్యాయవాదితో కలిసి కో పైలెట్ హాజరు
- మూడున్నర గంటలపాటు కొనసాగిన విచారణ
- వైఎస్.జగన్ పర్యటన వివాదంపై కొనసాగుతున్న విచారణ

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి ఈనెల 8వ తేదీన సత్యసాయి జిల్లా పాపిరెడ్డిపల్లి గ్రామానికి విచ్చేశారు. ఈ సమయంలో భద్రతా వైఫల్యం కొట్టొచ్చినట్టు కనిపించిందని వైసిపి ఆరోపణలు చేసింది. ప్రధానంగా హెలికాప్టర్ వద్ద సరైన భద్రతా ఏర్పాట్లు లేవని వైసిపి ఆరోపిస్తోంది. ఈ నేపథ్యంలో ఆ రోజు హెలికాప్టర్ విషయంలో ఏ లోపాలు జరిగాయన్నది గుర్తించేందుకు పోలీసులు విచారణ కొనసాగిస్తున్నారు. హెలికాప్టర్ నడిపిన పైలెట్ అనిల్‌కుమార్, కో పైలెట్ శ్రేయన్ జైన్‌కు ఇదివరకే నోటీసులిచ్చారు. బుధవారం నాడు విచారణకు హాజరుకావాలని అందులో పేర్కొన్నారు. ఈ నోటీసులు అందుకున్న పైలెట్ అనిల్‌కుమార్, కో పైలెట్ శ్రేయన్ జైన్ ఇద్దరిలో కో పైలెట్ ఒక్కరే హాజరయ్యారు. పైలెట్ అనిల్‌కుమార్ మాండేటరీ లీవులో ఉన్నందున హాజరు కానట్టు సమాచారం. కో పైలెట్ శ్రేయన్ జయన్ ఆయన తన న్యాయవాది రత్నదీప్ ముఖర్జీతో కలసి చెన్నేకొత్తపల్లి పోలీసు స్టేషన్‌లో జరిగిన విచారణకు బుధవారం ఉదయం 11 గంటలకు హాజరయ్యారు. ఆయన్ను రామగిరి సర్కిల్ ఇన్స్‌పెక్టర్ శ్రీధర్, డీఎస్పీ హేమంత్ కుమార్ సమక్షంలో విచారణ చేపట్టారు. సుమారు మూడున్నర గంటలపాటు విచారణ కొనసాగింది. ఈ విచారణలో వందకుపైగా ప్రశ్నలను కో పైలెట్‌కు అడిగినట్టు సమాచారం. హెలికాప్టర్‌ను ఎవరు బుక్ చేశారు.. మొదలుకుని ఎవరి అనుమతితో తిరుగు ప్రయాణమయ్యారన్న ప్రశ్నలు అడిగినట్టు తెలుస్తోంది. అంతేకాకుండా తిరుగు ప్రయాణంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి ఎందుకు తీసుకెళ్లలేదని ప్రశ్నించినట్టు సమాచారం. హెలికాప్టర్‌లో ప్రయాణీకులు కూర్చొనే వైపు ఉన్న అద్దం పగలడంతో ఆయన్ను తీసుకెళ్లలేదని కో పైలెట్ చెప్పినట్టు తెలుస్తోంది. మరి హెలికాప్టర్ మరమ్మత్తుల్లేకుండా ఏ రకంగా వెళ్లిందని ప్రశ్నించినట్టు తెలుస్తోంది. అక్కడుంటే హెలికాప్టర్‌కు మరింత ప్రమాదం జరుగుతుందని భావించి పైలెట్ నిర్ణయం మేరకు తీసుకెళ్లినట్టు కో పైలెట్ సమాధానం చెప్పినట్టు సమాచారం. ఈ ప్రశ్నలకు కొంత వరకు పోలీసులు సంతృప్తి చెందినట్టు తెలుస్తోంది. పైలెట్‌కు మరోమారు నోటీసులు అందించే అవకాశాలున్నట్టు తెలుస్తోంది. అదే విధంగా హెలికాప్టర్ కంపెనీకే కాకుండా పర్యటన సందర్భంగా బుక్ చేసిన ట్రావెల్ ఏజెన్సీకి కూడా నోటీసులిచ్చేందుకు పోలీసులు సిద్ధమయ్యారు.

కంపెనీలను భయపెట్టే ప్రయత్నమిది

ఉషశ్రీ చరణ్ శ్రీ సత్యసాయి జిల్లా వైసిపి అధ్యక్షురాలు

వైఎస్.జగన్మోహన్‌రెడ్డి ప్రజల్లోకి వస్తే వస్తున్న ఆదరణ చూసి టిడిపి భయపడుతోందని సత్యసాయి జిల్లా వైసిపి అధ్యక్షురాలు ఉష చరణ్ శ్రీ విమర్శించారు. అందుకే ఆయన ప్రజల్లోకి వెళ్లకుండా అడ్డుకునే భాగంలోనే సంబంధంలేని హెలికాప్టర్ కంపెనీకి నోటీసులిచ్చారన్నారు. ఆ సంస్థను భయపెట్టేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. ఇటువంటి వాటితో జగన్మోహన్‌రెడ్డి పట్ల ప్రజల్లోను ఉన్న ఆదరణను తుడిచిపెట్టలేరని ఆమె చెప్పారు.

పరిశ్రమల స్థాపనతో ఆర్థిక ప్రగతి

కలెక్టర్ టిఎస్.చేతన్

సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ టిఎస్.చేతన్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

జిల్లాలో పరిశ్రమల స్థాపన ద్వారా ఆర్థిక ప్రగతి సాధ్యమని కలెక్టర్ టి.ఎస్.చేతన్ స్పష్టం చేశారు. బుధవారం స్థానిక కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్ సమావేశ మందిరంలో జిల్లా పరిశ్రమలు, ఎగుమతి ప్రోత్సాహక కమిటీ (డిఐఈపిసి) సమావేశం నిర్వహించారు. ముందుగా జిల్లా పరిశ్రమల శాఖ పనితీరుపై సమీక్షించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పారిశ్రామిక రంగాన్ని పటిష్టం చేసి మరింత విస్తృత పరిచేందుకు అన్ని అనుబంధ శాఖలు సమన్వయంతో జిల్లా ఆర్థిక ప్రగతికి ఆయువు పట్టు ఆయన పారిశ్రామిక రంగాన్ని మరింత అభివృద్ధి పథంలోకి తీసుకురావాలని సూచించారు. రాష్ట్రంలో పారిశ్రామిక పెట్టుబడుల ప్రోత్సాహకాన్ని పెంపొందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న నూతన ఇండస్ట్రియల్ పాలసీకి అనుగుణంగా జిల్లా ఆర్థిక అభివృద్ధికి దోహద పడేలా జిల్లాలో నిరుద్యోగ యువతకు ఉపాధి, ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు ప్రోత్సాహం అందివ్వనున్నట్లు తెలిపారు. జిల్లాలో పరిశ్రమల స్థాపనతో ఎక్కువమందికి ఉపాధి అవకాశాల ఏర్పాటుకు అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. పెండింగ్‌లో ఉన్న అన్నిదరఖాస్తులను నిర్ణీత సమయంలోపు పరిష్కరించాలని తెలిపారు.

వాట్సాప్ గవర్నెన్స్‌పై అవగాహన

ప్రతి ఒక్కరూ వాట్సాప్ గవర్నెన్స్‌ను ఉపయోగించుకునేలా కార్యక్రమ రూపకల్పన చేయాలని కలెక్టర్ టిఎస్.చేతన్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ సమావేశ మందిరంలో గ్రామ వార్డు సచివాలయాల ఆధ్వర్యంలో వాట్సాప్ గవర్నెన్స్‌పై ప్రజలకు విస్తృతంగా అవగాహన కార్యక్రమం నిర్వహించాలి అనే గోడపత్రికను కలెక్టర్ ఆవిష్కరించారు ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఏప్రిల్ 15 తేదీ నుండి ప్రతి ఇంటికి మనమిత్ర కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రతి పౌరుడి ఫోనులో 9552300009 నెంబరు సేవ్ చేయించాలన్నారు. దీని ద్వారా ప్రస్తుతం ప్రభుత్వం 210 సేవలు కల్పిస్తున్నామని, మరో వారంలో రోజుల్లో ఈ సంఖ్య 250కి పెంచుతున్నామనమని, పక్షం రోజుల్లో 350 సేవలు అందించనున్నామన్నారు. ప్రజలందరూ దీనిని సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

సదస్సును జయప్రదం చేయండి

ప్రజాశక్తి నంబులపూలకుంట

మండల పరిధిలోని ఎర్ర వంకల వారి పల్లి ,జవు, మరికొమ్మ దీన్నే గ్రామాలలో బుధవారం సోలార్ ప్రాజెక్టు ఏర్పాటు పై ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టారు. ఈ సమావేశానికి ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జంగాలపల్లి పెద్దన్న హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ప్రభుత్వాలు ఇంటికొక ఉద్యోగం అని చెప్పి మోసం చేశాయన్నారు. అదేవిధంగా సాగు చేస్తున్న రైతులందరికీ పరిహారం అందిస్తామని చెప్పి అన్నదాతలకు అన్యాయం చేశారన్నారు. 18వ తేదీ శుక్రవారం జవుకుల గ్రామంలో ఉదయం 11 గంటలకు నిర్వహించే సదస్సుకు రైతు సంఘం రాష్ట్ర నాయకులు ప్రభాకర్ రెడ్డి హాజరుకానున్నారని వివరించారు. రైతులకు న్యాయం జరిగే విధంగా పోరాటం చేస్తున్న సదస్సుకు రైతులందరూ హాజరై జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల రైతు సంఘం నాయకులు నాగిరెడ్డి, నాగరాజు, ఈశ్వర రెడ్డి రైతులు సి రమణయ్య, సుబ్బయ్య, ఆంజనేయులు గంగులయ్య, చందమామ చెన్నప్ప, ఆంజనేయప్ప, పకీరప్ప తదితరులు పాల్గొన్నారు.

రైతులతో మాట్లాడుతున్న నాయకులు

బ్యాంకులో ప్రయివేటు వ్యక్తుల హవా ఇబ్బందుల్లో రైతులు

ప్రజాశక్తి - తనకల్లు

మండల పరిధిలోని కొక్కంటి క్రాస్ లోగల యూనియన్ బ్యాంకులో ప్రయివేటు వ్యక్తుల హవా కొనసాగుతోంది. బ్రాంచ్ మేనేజర్ గా విధులు నిర్వహిస్తున్న ఆంజనేయులు నాయక్ నేతృత్వంలో బ్యాంకు లో ప్రైవేట్ వ్యక్తుల హవా నడుస్తోందని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బాలసముద్రం యూనియన్ బ్యాంక్ మేనేజర్ తాను నియమించుకున్న ప్రయివేటు వ్యక్తులు సిఫారసు చేస్తేనే క్రాప్ లోను పెంచుతున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. సంబందిత బ్యాంకు ఉన్నతాధికారులు బాలసముద్రం యూనియన్ బ్యాంకును సందర్శించి ప్రయివేటు వ్యక్తుల ప్రమేయాన్ని ఆపి రైతులకు న్యాయం చేయాలని అన్నదాతలు కోరుతున్నారు. రుణాలు రెన్యువల్ చేసే వడ్డీ డబ్బులు మాత్రమే కట్టించుకొని రెన్యువల్ చేయాలని కోరుతున్నారు.

రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలి

ప్రజాశక్తి -పరిగి

ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వైద్య సేవల కోసం వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని డిఎంహెచ్ఒ పైరోజ్ బేగం డాక్టర్లను ఆదేశించారు. ఈ మేరకు ఆమె బుధవారం పరిగి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని, ఊటకూరు పిహెచ్‌సిని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో మందుల పంపిణీ, హాజరు రిజిస్టర్ , ,ల్యాబ్ ఇన్వెస్టిగేషన్ రిజిస్టర్ పరిశీలించారు. అనంతరం లేబర్ వార్డ్, సెషన్ సైట్‌లు, రోజువారీ పారామీటర్‌లో సేవలపై ఆరా తీశారు. అనంతరం సిపిఎం నాయకులు కిరణ్, జై భీమ్ పార్టీ నాయకులు నాగరాజు డిఎంహెచ్ఒకు వినతి పత్రం అందజేశారు. కొత్తగా ఏర్పడిన ఊటుకూరు పీహెచ్సీ కేంద్రానికి సరిపడా మందులు అందుబాటులో ఉంచాలని కోరారు. పిహెచ్‌సికి నూతన భవనం నిర్మాణానికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైద్యులు సురేష్, స్వరూప రెడ్డి, నవీన తదితరులు ఉన్నారు.

రికార్డులు పరిశీలిస్తున్న డిఎంహెచ్ఒ

ప్రజాసమస్యల పరిష్కారానికే ప్రాధాన్యత : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-నంబులపూలకుంట

ప్రజాసమస్యల పరిష్కారానికే తొలిప్రాధాన్యత ఇస్తున్నట్లు ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ప్రజా పరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపీపీ ఈటే రాము ఆధ్వర్యంలో ప్రజా సమస్యల పరిష్కార ప్రజావేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలు తమ సమస్యలను పరిష్కరించుకునేందుకు ప్రజా వేదిక, మండల అధికారులను ఆశ్రయిస్తుంటారని తెలిపారు. అలాంటి సమస్యలను అధికారులు పరిష్కరించినప్పుడే అధికారులకు, ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందని చెప్పారు. తెలుగుదేశం పార్టీ క్రమశిక్షణతో పనిచేస్తుందని తన 25 సంవత్సరాల రాజకీయ జీవితంలో ఏనాడు ప్రజలను మరవలేదని గుర్తుచేశారు. అధికారులు కూడా సమస్యలతో వచ్చిన ప్రజలతో ఓపికగా వ్యవహరించి వారి పరిష్కరించాలని సూచించారు. ప్రజలు వ్యక్తిగత అభిప్రాయాలతో మనస్పర్థలు ఏర్పడి సమస్యలు అధికారుల దృష్టికి తీసుకువస్తారని అలాంటివారికి శాంతియుతమైన వాతావరణాన్ని కల్పించాలని కోరారు. మండల అభివృద్ధికి ప్రభుత్వం నుంచి నిధులు తీసుకు వస్తామని చెప్పారు. వేసవిలో ఏ గ్రామంలోనూ నీటి సమస్య తలెత్తకుండా అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలని ఎంపీడీవోకు సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి అంజినమ్మ, తహశీల్దార్ దేవేంద్ర నాయక్, క్లస్టర్ ఇన్‌ఛార్జి దండే రవి, మాజీ జడ్పిటిసి అంజనప్ప నాయుడు తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కందికుంట

మౌలిక వసతులు కల్పించాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి - గుడిబండ

పరీక్ష ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనపర్చిన గుడిబండ ఎం జె పి కళాశాలలో విద్యార్థులను అభినందించిన ప్రజాప్రతినిధులు కళాశాలలో మౌలిక సదుపాయాలు కల్పించి విద్యార్థులను ఆదుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ఈరేష్ డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా విడుదలైన ఇంటర్మీడియట్ ఫలితాల్లో శ్రీ సత్య సాయి జిల్లా గుడిబండ లోని మహాత్మ జ్యోతిరావు పూలే బాలికల గురుకుల కళాశాల విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించారన్నారు. అందుకు ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీగా విద్యార్థులను, ప్రిన్సిపల్‌ను, అధ్యాపకులను అభినందిస్తున్నామన్నారు. రెండు రోజుల క్రితం స్థానిక ప్రజాప్రతినిధులు కూడా కళాశాలకు వచ్చి అభినందించారని అయితే అదే తరుణంలో ఈ కళాశాల అభివృద్ధికి కూడా చర్యలు తీసుకోవాలని సూచించారు. వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభం లోపు గుడిబండ, గుండుమలలోని జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాల కళాశాలల భవనాలు పూర్తిచేసి ఉపయోగం లోకి తీసుకొని రావాలని మౌలిక వసతులు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు పాల్గొన్నారు.

మంత్రుల పర్యటనను విజయవంతం చేయండి

ప్రజాశక్తి మడకశిర

నియోజకవర్గం లో శుక్రవారం జరిగే మంత్రుల పర్యటనను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి కోరారు. ఈ మేరకు వారు బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 8వ తేదీ న విద్యుత్ సబ్ స్టేషన్ ప్రారంభోత్సవం, శంకుస్థాపన కార్యక్రమాలకు విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, జిల్లా ఇంచార్జ్ రెవెన్యూ మంత్రి అనగాని సత్య ప్రసాద్, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్, బీసీ వెల్ఫేర్, చేనేత జౌళిశాఖ మంత్రి సవితమ్మ, హిందూపురం ఎంపీ బీకే పార్థసారథి హాజరుకానున్నారన్నారు. కూటమి నాయకులు కార్యకర్తలు అధికసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

విజ్ఞానయాత్రకు విద్యార్థులు

ప్రజాశక్తి-హిందూపురం

ఇన్ స్పైర్ మనాక్ అవార్డులో ఉత్తమ ప్రయోగ నమూనాలను తయారుచేసిన విద్యార్థులు విజ్ఞాన యాత్రలో భాగంగా బుధవారం రాత్రి శ్రీహరికోటకు బయలుదేరి వెళ్లారు. ఎంఇఒలు గంగప్ప, ప్రసన్నలక్ష్మిలు జెండా ఊపి బస్సును ప్రారంభించారు. ఇన్ స్పైర్ అవార్డులలో భాగంగా మడకశిర, హిందూపురం నియోజకవర్గాల్లోని ప్రభుత్వ పాఠశాలలో 6 నుండి 9 తరగతులలో చదువుతున్న విద్యార్థులు తయారుచేసి పంపిన ప్రాజెక్టులలో ఎంపిక చేసిన విద్యార్థులను విద్యాశాఖ నెల్లూరులోని శ్రీహరికోట అంతరిక్ష కేంద్రానికి విజ్ఞాన యాత్రకు ఎంపిక చేసింది. దాదాపు 50 మంది విద్యార్థులు ఈ విజ్ఞాన యాత్రకు బయలుదేరి వెళ్లారు. ఈ కార్యక్రమంలో బివి ప్రసాద్, జగదీశ్, విజయ భార్గవి, శైలజ, అనిత పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించకుంటే సమ్మెకు సిద్ధం

హిందూపురంలో మోకాళ్లపై నిరసన తెలుపుతున్న కార్మికులు, నాయకులు

పెనుకొండలో ఆర్డీవోకు వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు, నాయకులు

ప్రజాశక్తి- హిందూపురం

ఆప్కాస్ లో పనిచేస్తున్న మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులందరినీ రెగ్యులర్ చేయాలని, జీవో నెంబర్ 36 ప్రకారం ఇంజనీరింగ్ కార్మికులందరికీ రూ. 21వేలు వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తు బుధవారం పారిశుధ్యకార్మికులు మున్సిపల్ కార్యాలయం ఎదుట నడి రోడ్డుపై మోకాళ్లపై కుర్చొని నిరసన తెలిపారు. అనంతరం మున్సిపల్ కార్యాలయం ఎదుట ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు) ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. తమ సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని మున్సిపల్ కమిషనర్ సంఘం శ్రీనివాసులకు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి జగదీష్, మున్సిపల్ యూనియన్ పట్టణ కమిటీ అధ్యక్షులు కే మల్లికార్జునతో పాటు నాయకులు ఆనంద్, రామచంద్ర, నారాయణ, బాలాజీ, చంద్ర, బాబయ్య, మూర్తి, శంకర, కవితమ్మ, శోభమ్మ, ఓబులమ్మతో పాటు కార్మికులు పాల్గొన్నారు.

పెనుకొండ :ఆప్కాస్ ను రద్దు చేసి కార్మికులను పర్మినెంట్ చేయాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్(సిఐటియు) రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా బుధవారం పెనుకొండ ఆర్డీవో ఆనంద్ కుమార్ కు వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా సిఐటియు మండల కన్వీనర్ బాబావలి మాట్లాడుతూ ఆప్కాస్ ను రద్దుచేసి ప్రైవేట్ ఏజెన్సీలకు అప్పగించడం వల్ల కార్మికులు ఇబ్బందులు ఎదుర్కొంటారన్నారు. కార్మికులకు ఇబ్బంది కలిగించే ఆప్కాస్ ను తక్షణం రద్దు చేయాలని ఆయన అన్నారు. ఇంజనీరింగ్ కార్మికులకు వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు చిన్నవెంకటేష్, నరసింహ, చలపతి, చంద్ర,వెంకటేష్, లక్ష్మీదేవి,నరసమ్మ,సాయి,రిక్షా నరసింహ, జబ్బర్, సిఐటియు నాయకులు నరసింహ ఆరిఫ్ తదితరులు పాల్గొన్నారు.

కదిరి టౌన్ : మున్సిపల్ కార్మికులను రెగ్యులరైజ్ చేయాలని కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మునిసిపల్ వర్కర్స్ అండ్ ఫెడరేషన్ సిఐటియు ఆధ్వర్యంలో బుధవారం రాష్ట్ర వ్యాప్త నిరసనలో భాగంగా కదిరి మున్సిపల్ కార్యాలయం దగ్గర ధర్నా నిర్వహించారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ఇన్‌ఛార్జి కమిషనర్ సాయిప్రసాద్‌కు అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు జి.ఎల్ నరసింహులు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని, కారుణ్య నియామకాలు చేపట్టాలని, గత సంవత్సరం కార్మికులు చేపట్టిన 17 రోజుల సమ్మె సందర్భంగా అప్పట్లో ప్రభుత్వం చేసుకున్న ఒప్పందాలకు జీవోలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కదిరి మున్సిపాలిటీలో పాడైపోయిన ట్రాక్టర్లకు మరమ్మతులు చేయాలని, పనిముట్లు ఇవ్వాలని, చెత్త సేకరణకు మరికొన్ని ఆటోలను ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ నాయకులు తిరుపాల, బాలకృష్ణ, జనార్ధన, చెన్నకృష్ణ, రామాంజులు, లక్ష్మన్న, నరసింహమూర్తి, సిఐటియు నాయకులు జగన్మోహన్, ముస్తాక్, రామ్మోహన్, రఫీ తదితరులు పాల్గొన్నారు.

పుట్టపర్తి క్రైమ్ : కూటమి ప్రభుత్వం కార్మికుల సమస్యలు పరిష్కరించాలని లేని పక్షంలో అవసరం అయితే అసెంబ్లీని ముట్టడిస్తామని సిఐటియు నాయకులు హెచ్చరించారు. ఈ మేరకు బుధవారం పట్టణంలోని గణేష్ సర్కిల్ వద్ద వినాయకునికి వినతిపత్రం ఇచ్చారు. ఈసందర్భంగా సిఐటియు మండల కన్వీనర్ పైపల్లి గంగాధర్ మాట్లాడుతూ, మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు నరసింహులు, నాగార్జున, రామయ్య, గోవింద్, పెద్దన్న, పుడా నాగభూషణ, సోడా వెంకటేష్, పెద్దింటి వెంకటేష్, సద్దాం, సరోజమ్మ, సాయమ్మ, నారాయణమ్మ, అనిత, తదితర కార్మికులు పాల్గొన్నారు.

కదిరిలో నిరసన తెలుపుతున్న కార్మికులు, నాయకులు

చిలమత్తూరులో భారీ వర్షం

ప్రజాశక్తి - చిలమత్తూరు

చిలమత్తూరు మండలంలో బుధవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. తొలి ముంగారులు సమీపిస్తున్న నేపథ్యంలో భారీ వర్షం కురవడం తో రైతుల్లో ఆశలు చిగురించాయి. బుధవారం కురిసిన వర్షానికి పొలాలను దుక్కు చేసేందుకు అవకాశం ఏర్పడింది. దీంతో పాటు వేడి వాతావరణం చల్లబడుతుందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. కాగా మండలంలోని సోమఘట్ట దేమకేతేపల్లి లో ప్రాంతంలో సాగు చేసిన వరి పంట భారీ వర్షానికి దెబ్బతింది.

బాధితుడికి ఆర్థికసాయం

ప్రజాశక్తి - కదిరి టౌన్

కదిరి రూరల్ కుమ్మరవాండ్లపల్లి గంగన్న గారి పల్లి కి చెందిన పెద్ద గంగులప్ప ఇటీవల జరిగిన ప్రమాదంలో గాయపడ్డాడు. విషయం తెలుసుకున్న వైసిపి రాష్ట్ర బీసీ విభాగం ఉపాధ్యక్షులు డాక్టర్ హరిప్రసాద్ స్పందించి తనవంతుగా ఆర్థిక సహాయం అందించారు.ఈ కార్యక్రమంలో వైసిపి సీనియర్ నాయకులు జగదీశ్వర్ రెడ్డి, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

సబ్‌స్టేషన్ ఏర్పాటు స్థల పరిశీలన

ప్రజాశక్తి - గుడిబండ

మండలంలోని కేకే పాళ్యం గ్రామం వద్ద ఏర్పాటు చేయనున్న విద్యుత్‌సబ్‌స్టేషన్‌కు అనువైన స్థలాన్ని స్థలాన్ని మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి పరిశీలించారు. ఈస్థలంలో సబ్‌స్టేషన్ ఏర్పాటుకు భూమి పూజ చేయనున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసమూర్తి,మండల కన్వీనర్ మద్దనకుంటప్ప, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు మంజునాథ్, జిల్లావీరశైవ లింగాయత్ అధ్యక్షులు దుర్గేష్, క్లస్టర్ ఇన్‌ఛార్జులు పాల్గొన్నారు.

కోరం లేక మండలమీట్ వాయిదా

ప్రజాశక్తి - రొద్దం

కోరం లేక మండల సాధారణ సర్వసభ్య సమావేశం వాయిదా పడినట్లు ఎంపీడీవో రాంకుమార్ తెలిపారు. మండల సర్వసభ్య సమావేశం బుధవారం నిర్వహించాల్సి ఉండగా కోరం లేక వాయిదా పడిందన్నారు.ఉదయం కోరం లేక మధ్యాహ్నం 2గంటలకి వాయిదా వేశామన్నారు. అప్పటికి సభ్యులు రాకపోవడం తో పూర్తిగా వాయిదా వేసినట్లు తెలిపారు. అయితే పలువురు ఎంపిటీసీలు మాట్లాడుతూ తమకు అందాల్సిన గౌరవ వేతనం ఇవ్వడం లేదని అందుకే సమావేశాన్ని బహిష్కరించామని చెప్పారు. దీనిపై ఎంపిడిఒ మాట్లాడుతూ ఎంపిటీసీలు వేతనాలు బడ్జెట్‌లో పెట్టామన్నారు.

ఉపాధి పనుల పరిశీలన

ప్రజాశక్తి - తలుపుల

మండల పరిధిలోని ఇందుకూరి పల్లి గ్రామ పరిధిలో కొండ ప్రాంతంలో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనులను ఎంపీడీవో రాములు నాయక్ బుధవారం పరిశీలించారు. వేసవి దృష్ట్యా తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

వడదెబ్బ పై అవగాహన

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

పుట్టపర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని వివేకానంద రోడ్డు, చిత్రావతి రోడ్డులో బుధవారం సామజిక ఆరోగ్య అధికారి నగేష్ వ్యాధి నిరోధక టీకాలు, వడదెబ్బపై ప్రజలకు అవగాహన కల్పించారు. వీలయినంత వరకు ప్రయాణాలు కానీ, పనులు కానీ ఉదయం 10 గంటలలోపు మధ్యాహ్నం 3 గంటల తరువాత ఉండేటట్లు చూచుకోవాలని సూచించారు. ఎవరైనా అస్వస్థకు గురి అయితే వెంటనే ఆసుపత్రికి తీసుకెళ్లాలని చెప్పారు. ఈకార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు పుష్ప, అంజుల, అనుపమ, ఆశా కార్యకర్తలు మంజుల, కాంతమ్మ, నాగరత్నమ్మ, ఉమ, రత్న కుమారి తదితరులు పాల్గొన్నారు.

20న ఉచిత సర్జరీ వైద్యశిబిరం

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

ధర్మవరం పట్టణంలోని స్పందన హాస్పిటల్ లో ఈనెల 20వ తేదీ ఆదివారం ఉదయం పదిగంటల నుండి మధ్యాహ్నం రెండు గంటల వరకు ఉచిత జనరల్ సర్జరీ వైద్య శిబిరమును నిర్వహిస్తున్నట్లు హాస్పిటల్ అధినేతలు డాక్టర్ బషీర్, డాక్టర్ సోనియా తెలిపారు. ఈమేరకు వారు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ శిబిరంలో హెర్నియా, హైడ్రోసిల్, థైరాయిడ్, రొమ్ములో గడ్డలు, అల్సర్, ఫిస్టులా, ఫైల్స్ ,అపెండిక్స్, గాల్ బ్లాడర్లో రాళ్ళు, శరీరంపై గడ్డలు మొదలైన వాటిని పరీక్షించి చికిత్సలు అందిస్తామన్నారు. అవసరమైన వారికి లాప్రోస్కోపిక్ సర్జరీ కూడా నిర్వహిస్తామని తెలిపారు. ఏ పథకము వర్తించని పేదలకు తగ్గింపు ఫీజుతోనూ ఆపరేషన్లు నిర్వహిస్తామని తెలిపారు.

సజావుగా మండలమీట్

ప్రజాశక్తి - చిలమత్తూరు

స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సర్వసభ్య సమావేశం సజావుగా సాగింది. మండల అధ్యక్షులు పురుషోత్తం రెడ్డి అధ్యక్షతన, ఎంపీడీవో రమణ మూర్తి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సమావేశంలో పలువురు సభ్యులు తమ గ్రామాల్లో నెలకొన్న తాగునీటి సమస్యను సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. వేసవిని దృష్టిలో పెట్టుకొని గ్రామాల్లో త్రాగునీటి సమస్యలు నివారించేందుకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపిపి అధికారులకు సూచించారు. కుల ధృవీకరణ, ఆదాయ పత్రాలు, కుటుంబ సభ్యుల సర్టిఫికెట్లు ఇచ్చే విషయంలో రెవిన్యూ అధికారులు వేగంతో పనిచేయకపోవడం పై ఎంపిటీసీ రఘు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో డిప్యూటీ తహశీల్దార్ జగన్నాథ్, ఎంపిటిసిలు, సర్పంచులు, ఆయా శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి ఆర్థికసాయం

ప్రజాశక్తి - పావగడ

తాలూకాలోని కొత్తూరు గ్రామానికి చెందిన గ్రామ పంచాయతీ సభ్యుడు వెంకటేష్ కొన్ని రోజుల క్రితం గుండెపోటుతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే హెచ్.వి వెంకటేష్ మృతుడి కుటుంబాన్ని పరామర్శించి లక్షరూపాయల ఆర్థికసాయం అందజేశారు.

ఆహార సంరక్షణ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలి

జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్

సమావేశంలో మాట్లాడుతున్న జేసీ

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

ఆహార సంరక్షణ ప్రమాణాల చట్టం 2026 ను పటిష్టంగా అమలు చేయాలని జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ పేర్కొన్నారు. ఆహార సంరక్షణ ప్రమాణాల చట్టం అమలుపై సంబంధిత అధికారులతో బుధవారం కలెక్టరేట్లోని తన ఛాంబర్‌లో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ మామిడి, అరటి, బొప్పాయ, దానిమ్మ, పండ్లపై కార్బైడ్ ఇతర హానికరమైన రసాయనాలు వేసి కృత్రిమంగా పరిపక్వత చెందే విధంగా వినియోగించి వినియోగదారుల ఆరోగ్యాలతో ఆడుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇది చట్టరీత్యా నేరమనిఅందుకు ఆరు నెలలు జైలు శిక్ష లక్ష రూపాయల వరకు జరిమానా విధించడం జరుగుతుందని హెచ్చరించారు. ఎవరైనా వ్యాపారులు ఇలా చేస్తున్నట్లు అనుమానం వస్తే వెంటనే ఆహార భద్రత అధికారులకు 9441463315 కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చన్నారు. వ్యాపారులు ఇలాంటి రసాయన మందులు పండ్లపై వాడుతున్నట్లు చాలామంది వినియోగదారులకు సమాచారం ఉందని అలాంటి పండ్లు తింటే ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆహార భద్రత అధికారి తస్లీమా, రామచంద్ర గౌడ్, జిల్లా వ్యవసాయ అధికారి సుబ్బారావు, ఉద్యానవన శాఖ అధికారి చంద్రశేఖర్, ఆర్డీవో సువర్ణ, మున్సిపల్ కమిషనర్ ప్రహల్లాద తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాలపై అప్రమత్తత అవసరం

కదిరి, పుట్టపర్తిలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న అగ్నిప్రమాద శాఖ అధికారులు

ప్రజాశక్తి - కదిరి టౌన్

అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు అప్రమత్తంగా ఉండాలని అగ్నిమాపక శాఖ అధికారులు సూచించారు.అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా మూడవరోజు బుధవారం పట్టణంలోని ఎన్జీవో కాలనీలో అల్కాపురి స్క్వేర్ అపార్ట్మెంట్‌లో, సైదాపురం ఎస్సీ కాలనీలో ప్రజలకు అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పించారు. అగ్నిప్రమాద నివారణకు చేపట్టవలసిన చర్యల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ఎన్ శ్రీధర్, సిబ్బంది ఉత్తమ్ రెడ్డి, శ్రీనివాసులు, చిరంజీవి, రవీందర్ నాయక్, అంజినప్ప, రమేష్ రెడ్డి, అహ్మదుషా, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరం రూరల్ : అగ్ని ప్రమాదాలు జరగకుండా ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని అగ్నిమాపక అధికారి యు. రాజు తెలిపారు. ఈ సందర్భంగా మూడవరోజు బుధవారం అగ్నిమాపక అధికారి రాజు ఆధ్వర్యంలో పట్టణంలోని జింకా రామాంజనేయులు సిల్క్ హౌస్ లో పనిచేస్తున్న సిబ్బందికి అగ్ని ప్రమాదాల నివారణ లో తీసుకోవలసిన జాగ్రత్తల గురించి డెమో ద్వారా అవగాహన కల్పించారు. అనంతరం కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

పుట్టపర్తి క్రైమ్ : అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు తగు జాగ్రత్తలు నివారణ చర్యలు పాటిస్తే జరిగే నష్టాన్ని అరికట్టవచ్చని సహాయ జిల్లా అగ్నిమాపక అధికారి ఎన్. నాగరాజు నాయక్ తెలిపారు. బుధవారం పట్టణంలోని సాయి లీల లేక్ వ్యూ అపార్ట్‌మెంట్‌తో పాటు చిత్రావతి రోడ్డులో నివాసం ఉన్న కాలనీవాసులకు అగ్ని ప్రమాద వారోత్సవాలలో భాగంగా అగ్ని ప్రమాదం జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు నివారణ పద్ధతులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆ కాలనీవాసులు, అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన వేలం పాటలు

ప్రజాశక్తి - కొత్తచెరువు

కొత్తచెరువు మేజర్ గ్రామపంచాయతీ లో సర్పంచి రాధా అధ్యక్షతన వేలం పాటలను బుధవారం నిర్వహించారు. గత మార్చి నెలలో వేలం పాటలు వాయిదా పడడంతో ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు తిరిగి నిర్వహించారు. వారపు సంతను రూ.7,17, 500లకు ఎం వెంకటేష్ దక్కించుకున్నారు. బస్టాండ్ రూ.4.24లక్షలకు శ్రీనివాసులు, దినసరి సంత నాగేంద్ర రూ.2.63 లక్షలకు దక్కించుకున్నాడు. వారపు సంత దినసరి సంతకు డీడీలు చెల్లించిన వారు సిండికేట్ గా ఏర్పడడంతో పంచాయితీకి ఆదాయం తగ్గింది. వేలం పాటలో దక్కించుకున్న వారు డబ్బులను వెంటనే జమ చేయాలని పంచాయతీ నిబంధనలకు మేరకే సుంకాలు వసూలు చేయాలని అధికారుల తెలిపారు. సులభ కాంప్లెక్స్ వేలంపాటను వాయిదా వేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో నటరాజు, పంచాయతీ ఇన్‌ఛార్జి కార్యదర్శి నాగరాజు, సిఐ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సంఘం సభ్యులుగా 'పురం' మున్సిపల్ ఛైర్మన్

ప్రజాశక్తి-హిందూపురం

రాష్ట్ర ఆర్థిక సంఘం సభ్యులుగా హిందూపురం మున్సిపల్ ఛైర్మన్ డిఈ రమేష్ కుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు సంబంధిత అధికారుల నుండి ఆయనకు నియామక ఉత్తర్వులు అందాయి. మున్సిపల్ ఛైర్మన్ డిఈ రమేష్ కుమార్ 16వ ఆర్థిక సంఘం సభ్యులుగా నియమితులు కావడం పట్ల తెలుగుదేశం పార్టీ నాయకులు, మున్సిపల్ కౌన్సిలర్లు హర్షం వ్యక్తం చేస్తూ ఆయనకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో డిఈ రమేష్ కుమార్ మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన ఎమ్మెల్యేకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. గురువారం తిరుపతిలో జరిగే 16వ ఆర్థిక సంఘం సమావేశంలో పాల్గొంటున్నట్లు ఆయన తెలిపారు. 16వ ఆర్థిక సంఘంలో రాష్ట్ర వ్యాప్తంగా 15 మంది సభ్యులు కార్పొరేషన్స్ ఛైర్మన్లు, మున్సిపల్ ఛైర్మన్ ఉన్నారని, రాయలసీమలో ముగ్గురిని రాష్ట్ర ప్రభుత్వం ఎంపిక చేసిందన్నారు. ఈ సమావేశంలో పలువురు మున్సిపల్ కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

బీసీ సంక్షేమ సభను విజయవంతం చేయండి

సమావేశంలో పాల్గొన్న నాయకులు

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

పట్టణంలోని పోలా ఫంక్షన్ హాల్లో ఈనెల 18వ తేదీన నిర్వహించే బీసీ సంక్షేమ సంఘం సభను విజయవంతం చేయాలని రాష్ట్ర బీసీ మహిళా సంక్షేమ సంఘం అధ్యక్షురాలు సంకారపు జయ శ్రీ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె స్థానికవిలేకరులతో మాట్లాడుతూ ఈ మహాసభ ద్వారా ఐక్యమత్యం చాటుకుందామని పిలుపునిచ్చారు. బీసీలు, చేనేతలు కలిసి అత్యధిక ఓట్లతో ధర్మవరం ఎమ్మెల్యేగా సత్య కుమార్ యాదవ్‌ను గెలిపించుకున్నామన్నారు. ఈ బీసీ మహాసభకు తెలంగాణ నుంచి బీసీ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొంటున్నారని చెప్పారు. , ధర్మవరం ఎమ్మెల్యే, మంత్రి సత్య కుమార్ యాదవ్, చేనేత జౌళి శాఖ మంత్రి సవిత, ఎంపీ పార్థసారథి, మాజీ మంత్రి శంకర్ నారాయణ, కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ , ఎమ్మెల్సీ మంగమ్మ ఈ సభకు హాజరవుతున్నట్లు తెలిపారు. వీరితోపాటు తెలంగాణ బీసీ జాతీయ నాయకులు శ్రీనివాసులు, మానవ హక్కుల సంఘం అధ్యక్షులు చిరంజీవులు పాల్గొంటున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు యుగంధర్, నీలూరి శ్రీనివాసులు, గిర్రాజు శశిధర్, బోయ రవిచంద్ర, బీసీ సంఘం నాయకులు జంగమన్న తదితరులు పాల్గొన్నారు.

సైనింగ్ స్టార్ అవార్డు అందుకున్న నీరుగంటి వాణి

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో వృత్తివిద్య కోర్సు చదివిన నీరుగంటి వాణి ఇటీవల విడుదలైన ఇంటర్మీడియట్ ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చింది. ఈ మేరకు ఆమె రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన సైనింగ్ స్టార్ అవార్డు అందుకున్నట్లు ప్రిన్సిపల్ అనూరాధ తెలిపారు. ఇటీవల రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ చేతుల మీదుగా వాణి ల్యాప్ టాప్ అందుకున్నట్లు తెలిపారు. వృత్తి విద్య కోర్సు సిఈటి గ్రూపులో వాణి 1000 మార్కులకు గాను978 మార్కులు సాధించినట్లు తెలిపారు. ప్రభుత్వ కళాశాలలో చదువుతూ ఉత్తమ మార్కులు సాధించి రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన సైనింగ్ స్టార్ అవార్డు అందుకోవడం పట్ల వాణిని ప్రిన్సిపల్‌తో పాటు అధ్యాపకులు అభినందించారు.

గుండెపోటుతో మాజీ వైస్ ఎంపిపి మృతి

ప్రజాశక్తి - పరిగి

మండల కేంద్రానికి చెందిన మాజీ వైస్ ఎంపీపీ చౌడప్ప బుధవారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న మంత్రి సవితమ్మ భర్త వెంకటేశ్వర్లు, హిందూపురం ఎంపీ పార్థసారథి, టిడిపి సత్యసాయి జిల్లా అధ్యక్షుడు వడ్డెర అంజనప్ప, వైసిపి జిల్లా అధ్యక్షురాలు ఉష శ్రీ చరణ్ , పరిగి వేణుగోపాలరావు చౌడప్ప మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ గోవింద్ రెడ్డి, మారుతి ప్రసాద్, నాగభూషణం, తిలక్ శ్రీనివాస్ రెడ్డి, ఈశ్వరప్ప తదితరులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం పురపాలక సంఘం పరిధిలోని అన్ని వార్డుల్లోనూ ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించే చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ ఛైర్మన్ డిఈ రమేష్ కుమార్ తెలిపారు. బాలయ్య పిఏలు వీరయ్య, బాలాజి, టిడిపి కో ఆర్డినేటర్ శ్రీనివాస్ రావుతో కలిసి మున్సిపల్ ఛైర్మేన్ రమేష్ కుమార్ 1వ వార్డు కొట్నురులో బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా ప్రజలతో నేరుగా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజల నుండి వచ్చిన ఫిర్యాదుల పట్ల అధికారులు నిర్లక్ష్యం వహించకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు నాగరాజు, మున్సిపల్ అధికారులతో పాటు వార్డు కౌన్సిలర్ మల్లికార్జున, డైమండ్ బాబా, అంజాద్, వార్డు ఇంచార్జ్ చంద్ర శేఖర్, టీడీపీ నాయకులు రామాంజి, రామకష్ణ, అశ్వర్థ, నాగభూషణం, కిష్టప్ప, వెంకటేష్, రాజు, శ్రీరాములు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

పంటపొలాలను పరిశీలించిన జనసేన నాయకులు

దెబ్బతిన్న అరటితోటను పరిశీలిస్తున్న చిలకం మధుసూదన్‌రెడ్డి, తదితరులు

ప్రజాశక్తి - తాడిమర్రి

ఇటీవల సంభవించిన గాలీవానకు దెబ్బతిన్న మండల పరిధిలోని పిన్నదరి గ్రామంలోని అరటి పంట పొలాలను జనసేన రాష్ట్ర నాయకులుమ చిలకం మధుసూదన్‌రెడ్డి బుధవారం పరిశీలించారు. గ్రామానికి చెందిన జనసేన పార్టీ నాయకులు ఆకుల రంగనాయకులు,ఆకుల హరి 16 ఎకరాల్లో అరటి తోటను సాగు చేయగా ఇటీవల కురిసిన తీవ్రమైన గాలి వానల కారణంగా 6 ఎకరాల్లో అరటిపంటను నష్టపోయారు. అదే విధంగా ఇదే గ్రామానికి చెందిన వికలాంగుడు రైతు లోకేష్ కూడా 2 ఎకరాలు అరటిపంటను నష్టపోయాడు. ఈ పంటపొలాలను పరిశీలించిన చిలకం మధుసూదన్‌రెడ్డి రైతులను పరామర్శించి వారికి జరిగిన నష్టం గురించి అడిగి తెలుసుకున్నారు. బాధిత రైతులకు ప్రభుత్వం నుంచి నష్టపరిహారం అందేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం హార్టికల్చర్ శాఖ అధికారులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంయుక్త కార్యదర్శి దూది జయరామాంజనేయులు ,మండల అధ్యక్షులు ఎర్రమల మోహన్ గౌడ్ , డీలర్ రామచంద్ర రెడ్డి, గోపాల్,శ్రీకాంత్, శ్రీనివాసులు, కూటమి నాయకులు రమణ, శ్రీనివాసులు ఫీల్డ్ అసిస్టెంట్ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

తొలి సైబర్ క్రైమ్ కేసు నమోదు

ప్రజాశక్తి - తనకల్లు

మండలంలో తొలి సైబర్‌క్రైం కేసు నమోదయింది. మండల పరిధిలోని మంగ దిన్నెపల్లికి చెందిన కాయల జనార్దన్ నాయుడు అనే వ్యక్తి వివాదాస్పద పోస్ట్ పెట్టిన కారణంగా అతని మీద సైబర్ క్రైమ్ పోలీసులు కేసు నమోదు చేశారు. జనార్దన్ నాయుడు తన ఫేస్‌బుక్ అకౌంట్ ద్వారా వివాదాస్పద పోస్టులను పెడుతున్నట్లు గుర్తించిన తనకల్లు ఎస్ఐ గోపీ జనార్ధననాయుడిని తహశీల్దార్ వద్ద బైండోవర్ చేయించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ మండల పరిధిలో ఎవరైనా గాని ప్రత్యక్షంగా గాని సోషల్ మీడియా ద్వారా గానీ కులం, లేదా మతం జాతి, ప్రదేశం, నివాసం, మరియు భాష, తదితర కారణాలు చేత వివాదాస్పద వ్యాఖ్యలు చేసినా, పోస్టులు పెట్టినా చట్టం ప్రకారం క్రిమినల్ కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

ధర్మవరం పట్టణం కేతిరెడ్డి కాలనీకి చెందిన బాషా (28) బుధవారం తన ఇంటిలో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బాషా ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తుండేవాడు. అప్పుల బాధతో జీవితంపై విరక్తి చెందిన ఆత్మహత్యకు పాల్పడ్డాడని మృతుని భార్య పేరు ఫాతిమాబీ తెలిపారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ పోలీసులు తెలిపారు.

గడ్డివామి దగ్ధం

ప్రజాశక్తి - చిలమత్తూరు

మండలంలోని మొరంపల్లి గ్రామంలో రైతు రామచంద్రా రెడ్డికి చెందిన మొక్కజొన్న గడ్డివామికి మంగళవారం రాత్రి గుర్తు తెలియని దుండగులు నిప్పుపెట్టారు. మూడున్నర ఎకరాల్లో పండించిన మొక్కజొన్నకు సంబంధించిన ఐదుట్రాక్టర్ల గడ్డిని నిల్వ చేసి ఉంచగా గుర్తుతెలియని వ్యక్తులు నిప్పుపెట్టారని వాపోయారు. ఇది సంవత్సరం పాటు పశువుల మేతకు ఉపయోగపడేదన్నారు. ఈ నేపథ్యంలో సిపిఎం నాయకులు ఫిరంగి ప్రవీణ్ కుమార్, మండల కార్యదర్శి వెంకటేష్ బాధిత రైతును పరామర్శించారు. ప్రభుత్వం స్పందించి రైతుని ఆదుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో శంకర్ రెడ్డి, శ్రీనివాసులు, కష్టప్ప తదితరులు పాల్గొన్నారు.

కొడిగెనహళ్లిలో భారీ చోరీ

రూ. 30 లక్షల విలువగల నగలు మాయం

ప్రజాశక్తి - పరిగి

మండలంలోని కోడిగేనహళ్లిలో భారీ చోరీ జరిగింది. విద్యానగర్ కు చెందిన శంకరప్ప ఇంట్లో గుర్తు తెలియని దుండగులు మంగళవారం రాత్రి చోరీకి పాల్పడ్డారు. రెండు రోజుల క్రితం కుటుంబ సమేతంగా ధర్మస్థలం దేవాలయానికి వెళ్లిన శంకరప్ప మంగళవారం తెల్లవారుజామున ఇంటికి వచ్చారు. ఇంటి తాళం తెరిచి ఉండటంతో అవాక్కయ్యారు. ఇంట్లోకి వెళ్లి పరిశీలిస్తే ఉన్న వస్తువులన్నీ చెల్లాచెదురుగా పడి ఉండటం బీరువా తెరిచి ఉండటంతో ఆందోళనకు గురయ్యారు. బీరువాలో ఉంచిన 35 తులాల బంగారం 40వేల రూపాయల నగదు లేకపోవడంతో స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ చోరీపై డీఎస్పీ నర్సింహప్ప ఆరా తీయడమే కాకుండా కొడిగినహళ్లి చోరీ జరిగిన ఇంటిని పరిశీలించి సీసీటీవీ పుటేజీని పరిశీలించారు. కాగా ఈ వారంలో కోడిగినహళ్లిలోని బిందు నగర్ అయ్యంగార్ బేకరీ, ఇతర ఇళ్లలో వరుస చోరీలు జరుగుతుండటంతో స్థానిక ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ఈ చోరీలకు పాల్పడిన వ్యక్తులను వెంటనే గుర్తించి అరెస్టు చేయాలని వారు కోరుతున్నారు.

హత్య కేసులో నిందితులు అరెస్టు

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

ధర్మవరం మండలం రావులచెర్వు గ్రామానికి చెందిన చిత్రా అక్కమ్మ అనే మహిళ హత్యకేసులో నిందితులను అరెస్టు చేసినట్లు రూరల్‌సిఐ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. హత్యకేసులో నిందితులైన షెక్షావలి, లోకేంద్ర ఆలియాస్ లోకీ ఆలియాస్ బొప్పాయిని అరెస్టు చేసినట్లు వివరించారు.

దాడిలో గాయపడ్డ వ్యక్తి మృతి

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం రూరల్ మండల పరిధిలోని జి. గుడ్డంపల్లిలో బుధవారం రాత్రి మద్యం మత్తులో ఇద్దరు వ్యక్తుల మధ్య దాడి జరిగింది. ఈ దాడిలో గాయపడ్డ సుబ్బరాయప్ప మృతి చెందినట్లు అతని కుటుంబ సభ్యులు తెలిపారు. సుబ్బరాయప్పను నంజే గౌడ అనే వ్యక్తి మద్యం మత్తులో ఇటుక పెళ్లతో తల మీద కొట్టగా బంధువులు చికిత్స నిమిత్తం హిందూపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్సల కోసం బెంగళూరుకు తరలిస్తుండగా మార్గమధ్యలో సుబ్బరాయప్ప మృతిచెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు హిందూపురం రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

డిజిటల్ శక్తులపై అప్రమత్తత అవసరం

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

బాల బాలికలకు వ్యక్తులతోనే కాదు డిజిటల్ శక్తులతో కూడా ముప్పు వాటిల్లుతుందని డిసిపి మహేష్ తెలిపారు. డివిజన్ స్థాయి మత పెద్దలతో పుట్టపర్తి మండల సమాఖ్య సమావేశ మందిరంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మహేష్ మాట్లాడుతూ చిల్డ్రన్ ఆఫ్ ఇండియా ఫౌండేషన్ , జిల్లా బాలల పరిరక్షణ సమితి సంయుక్త ఆధ్వర్యంలో నేటితరం పిల్లలు ఆన్లైన్ వేధింపులకు గురి కాకుండా ఎలాంటి విధి విధానాలు పాటించాలన్న విషయాలపై అవగాహన కల్పించారు. పిల్లలకు ఆన్‌లైన్‌లో ఎవరి నుండైనా ప్రమాదం పొంచి ఉందన్న అనుమానం కలిగితే సైబర్ క్రైం టోల్ ఫ్రీ నంబర్ 1930 కి ఫోన్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రొటెక్షన్ ఆఫీసర్ మురళీధర్, సోషల్ వర్కర్ ఆనంద్, మత పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

శ్రీ చైతన్య స్కూల్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - గోరంట్ల

గోరంట్ల లోని శ్రీ చైతన్య పాఠశాల విద్యార్థులు ఐఎన్‌టిఎస్ఒ పరీక్షలలో ప్రతిభ చాటారు ఈ సందర్భంగా ఎజిఎం సుబ్బారెడ్డి ప్రతిభా విద్యార్థులను అభినందించారు. ప్రథమ బహుమతి సాధించిన 6వ తరగతి చెందిన జోషనిత రెడ్డి, 4వ తరగతి చెందిన కార్తికేయకు లెనోవా టాబ్ లను అందజేశారు. రెండవ బహుమతి ఇద్దరికి, మూడవ బహుమతి ఒకరికి, నాల్గవ బహుమతి ఇద్దరికి, ఐదవ బహుమతి ఇద్దరికి కన్సోలేషన్ బహుమతి 29 మందికి, స్పెషల్ బహుమతి 8 మందికి, గోల్డ్ మెడల్ 47 మందికి ఇలా 182 బహుమతులు గెలుచుకున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ కె. మోహన్ రెడ్డి, జోనల్ అకడమిక్ కోఆర్డినేటర్ ఇర్షాద్,ఉపాధ్యాయులు, తల్లి తండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ముగిసిన ఉరుసు ఉత్సవాలు

ప్రజాశక్తి-హిందూపురం

పట్టణ సమీపంలో ఉన్నా లేపాక్షి మండలం కల్లూరు వద్ద వెలిసిన హజరత్ సయ్యద్ యూసుఫుల్లా షా ఖాద్రీ ఉరుసు ఉత్సవాలు ముగిశాయి. మూడు రోజులుగా ఎంతో వైభవంగా ఉరుసు ఉత్సవాలు నిర్వహించారు. మంగళవారం రాత్రి దర్గా పీఠాధిపతి హజరత్ మొహమ్మద్ రఫీవుల్లా షా కమల్ పోష్ ఖాద్రి వారి ఆధ్వర్యంలో సర్వమత సమ్మేళనం జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి శ్రీనాథ్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా విజయవాడకు చెందిన అహ్మద్ జానీ, మహమ్మద్ సుభాని, అశ్వర్థ నారాయణస్వామి, ఫాస్టర్ శీలం దాస్, ఏ సీ నాగరాజు, ఆదిమూర్తి, మహబూబ్ దౌలా, ఉమర్ ఫారూఖ్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా ఏర్పాటుచేసిన ఖవ్వాలి కార్యక్రమం ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో హజరత్ షాబుద్దీన్, మహబూబ్ భాషా ఖాద్రీ, షబ్బీర్ తదితరులు పాల్గొన్నారు.

సర్వమత సమ్మేళనంలో మతపెద్దలు